

# శ్రీ లంచావతారాలు

**జ్యోత్స్న**

ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం. సాయంత్రం అయిదు గంటలు. విద్యార్థుల సాంస్కృతిక పోటీ జరుగుతోంది; "ప్రగతి పథంలో లంచగొండితనం" అనే విషయం పైన.

అప్పటికి ముగ్గురు వక్తలు తర్వాత, నాలుగో సంవత్సరం వాడైన వెంకటేశ్వర రావు ఉపన్యాసం జరుగుతోంది. కార్యక్రమ నిర్వాహకురాలైన నీలిమ, ఇంటర్ సెకండియర్, 'బి' సెక్షన్‌కి ఒళ్ళంతా చెమటలు పోకడం పూర్తయి, తేళ్ళు, జెర్రులు యథేచ్ఛగా ఒంటిమీద ఉద్యాన విహారం చేసుకుంటున్న భ్రాంతి కలిగి, చివాలున లేచి నిలబడింది. ఉపన్యాసాన్ని ఒళ్ళంతా కళ్ళు చేసుకు వింటున్న అమ్మాయిల మధ్య. షటప్ అని అరిచింది. "హా" అని హుంకరించ బోయింది కాని చేత కాలేదు. సభ అంతా గందరగోళమై పోయింది.

వెంకటేశ్వరరావు మంచి స్పీకరే, అంత కన్నా ముఖ్యం అందంగా, దాదాపు ఆరడుగుల పొడుగుంటాడు. అంచేత కాలేజీలో అతను మైకు ముందు ఏం మాట్లాడినా అమ్మాయిల సపోర్టు ఉంటుంది. వాళ్ళమీద గౌరవం కొద్దీ అబ్బాయిలు కూడా అల్లరి చేయరు.

అలాంటిది వెంకటేశ్వరరావు మాట్లాడుతుంటే నీలిమకి అంత ఘోరంగా కోపం రావడం ఎందుకో ఎవరికీ అర్థం కాలేదు.

వక్తలు ఏం చెప్తున్నారో వాళ్ళు వినకపోవడమే దానికి కారణం. అబ్బాయిలు అమ్మాయిల్ని అమ్మాయిలు స్టేజీ మీద వున్న అబ్బాయిల ఆకార వికారాలనీ చూస్తూ ఉండిపోడమే దానికి కారణం.

ఈ డిబేట్ టాపిక్ నిర్ణయించడానికి నీలిమ చాలా తీవ్రంగా ఆలోచించింది. స్నేహితురాళ్ళ సలహాలు తీసుకుంది; మర్యాదకోసం కొందరు అబ్బాయిల సలహా కూడా తీసుకుంది. అభ్యుదయ భావాల్ని అన్నీ ఒక్కసారి జనం నోట్లో కుక్కితే గొంతు దిగక కక్కేస్తారని, చిన్న డోసుల్లో ఎక్కించాలనీ నేర్పుగా లంచగొండితనం అనే చర్చనీయాంశం ఎన్నుకొంది. ప్రగతి పథంలో లంచగొండితనం అంటే ఆమె ఉద్దేశం మన సమాజం ఎమర్జెన్సీలో ప్రగతి పథాన్ని పట్టింది కనుక ఆ దృష్ట్యా లంచగొండి తనం యొక్క దుష్ట పాత్రని ఎక్స్‌పోజ్ చేయాలని. అప్పుడు లంచగొండులు ఎంత క్రూరులో, ఎలా అభ్యుదయాన్ని నిరోధిస్తారో వెల్లడి అవుతుంది. వాళ్ళ అన్నయ్య స్టాలినూ, అక్కయ్యా కృపాస్కయా అమెరికాలో ఉంటున్నారు. వాళ్ళ ఉత్తరాల్లో అమెరికాలో అసలు లంచం అనేది లేదనీ, అందుకే అంత అభివృద్ధి (రష్యా అంత కాదనుకో) సాధ్యమైందని ఓసారి ఉత్తరంలో రాసిన విషయం నీలిమ హృదయంలో చెరగని ముద్ర వేసింది.

కాని డిబేట్ లో పాల్గొన్నవాళ్ళెవరూ ఆమె భావ గాంభీర్యాన్ని గ్రహించలేదు. మొదట మాట్లాడిన శబ్దానంద్ ప్రగతి పథంలో లంచగొండితనం అంటే లంచగొండి తనం ప్రగతిని సాధిస్తోంది అన్న అర్థాన్ని తీసుకుని లంచగొండితనం పెరిగిందంటే దానర్థం ప్రజల కొనుగోలు శక్తి పెరగటమేనని అంచేత దేశాభివృద్ధికి అది కొలత అనీ సూచించాడు. అంచేత దేశాభివృద్ధికి అది కొలత అనీ సూచించాడు. లంచం ఇచ్చేవాళ్ళంటే లేదా తీసుకోడం అంటే జనానికి ఆదాయం పెరిగిందన్న మాట.

రెండోవాడు కృష్ణకుమార్ చర్చనీయాంశాన్ని మరింత సహృదయంతో అపార్థం చేసుకున్నాడు. ప్రభుత్వం కనీస వేతనాన్ని పెంచడం లేదు. లంచాలని ఉద్యోగులకిచ్చే అనధికార బోనస్‌గా పరిగణించాలి. ఆ విధంగా లంచం అధికోత్పత్తికి చాలా అవసరం.

మూడోవాడు కుచేలరావు లంచ గొండితనం విప్లవ శక్తి అనీ, పేదప్రజలు లంచం ఇచ్చుకోలేరు కనుక ప్రజా పోరాటానికి అది దోహదం చేస్తుందనీ --- ఆ బాణీలో మాట్లాడాడు.

వీళ్ళ ముగ్గురి ఉపన్యాసాలు వినేసరికి నీలిమకి ఏడుపొచ్చినంతపనైంది "ఇడియట్స్. సోషల్ సైన్సెస్ అలా వుంచి కామన్ సెన్స్ కూడా లేదు." పక్కనున్న ఇందిరాదేవికి చెప్పేసింది. కూడాను. పైగా వాళ్ళ మేథాశక్తి మీద ఆమెకేమీ గౌరవం లేదు. కాని -

వెంకటేశ్వరరావు అలా మాట్లాడుతాడనుకోలేదు. అతను కాలేజీ హీరో. చాలా బలంగా ఆరోగ్యంగా, ఉషారుగా వుంటాడు. బోళ్ళన్ని జెనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివాడు. అంతే కాదు. కథలు రాస్తాడు. అమ్మాయిల్ని ఏడిపించడు.

ఈ రోజు కార్యక్రమంలో అతని మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది నీలిమ. మొదటి ముగ్గురూ టాపిక్ ని ఘోరంగా అపార్థం చేసుకుని మాట్లాడినందుకు అతను తన వాగ్ధాటితో వాళ్ళ తాటలు ఒలిచేస్తాడని ఎదురు చూస్తూ సంబర పడుతోంది.

వెంకటేశ్వర్రావు ఇలా మాట్లాడాడు. "అధ్యక్ష, సోదర సోదరీ మణులారా. ఈ చర్చనీయంశం కోట్లకి విలువైంది అంటే మరోలా అనుకోకండి - లంచానికి సంబంధించినది కనుక. అంతే దీనికి అంతకంటే విలువ లేదు. ప్రగతికీ లంచగొండి తనానికీ ఏ మాత్రం సంబంధం లేదు. మనం ప్రగతి పథంలో ఉన్నామా లేదా అనేది ఆనక చర్చిద్దాం. లంచ గొండితనం అభ్యుదయ కరమూ కాదు - తద్విరుద్ధమూ కాదు. అభ్యుదయం మనుషుల సృజనాత్మక శక్తి - తెలుగులో చెప్పాలంటే creative intelligence- వలన వస్తుంది.

మనిషి ఆలోచన అసలు చోదక శక్తి బుర్రలో వుంటుంది ఆలోచన బుర్రలేని వాళ్ళు లది బజారులో అంటే సమాజంలో వుందను కుంటారు. కాని, నే చెప్పేది, ఎవరు కాదన్నా సరే, ఆలోచనలు మనిషి మెదడులో పుడతాయని. అంటే మనుషుల మెదడు పెరగాలి, నరాలు బలపడాలి అదీ ప్రగతి మార్గం.-

అప్పుడు నీలిమ షటప్ అని అరచింది. గగ్గోలు మొదలైంది. సభకు అధ్యక్షత వహించిన బోటని లెక్చరర్ పరిస్థితిని అదుపులో పెట్టడానికి ప్రయత్నించాడు. కుర్రాళ్ళు ఓపక్కనించి ఈలలూ, బల్లలు మోగిస్తూ జెబోలో బే ఇమాన్ కీ పాట అందుకున్నారు. మేష్టారూ లంచం ఏం దొరకటంలేదు కనుక దాన్ని గురించి విని ఆనందిద్దామా' అని ఒకడు అరిచేసరికి, ఆయన మొహం సముద్రపు పీతలా ఎర్రగా కందిపోయి, గబగబా వెళ్ళిపోయాడు. అడవి రాముడు సినీమాకి విద్యార్థులు వెళ్ళిపోయారు. నీలిమ స్నేహితురాళ్ల మధ్య నిలబడిపోయింది. అవమానంతో.

వెంకటేశ్వర్రావు అక్కడకు వచ్చి ఏమీ జరగనట్లు నవ్వుతూ, "అడవిరాముడు చూశాం. ఏనుగులు అద్భుతంగా నటించిన చిత్రం. వాటికి ఓవర్ యాక్షన్ చేతకాదుగా. హాయిగా వుంది... మరో రహస్యం! ఈ వేళ రెండు షోలకి స్టూడెంట్ కన్సెషన్, తెల్సుగా?

థియేటర్ ఓనర్‌గారబ్బాయి వచ్చే ఏడు కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుగా నిలపడతాడుట. అబ్బే దీన్ని లంచగొండితనం అని నేననటం లేదనుకోండి. ఇప్పుడు ప్రగతి పథం ఏదంటే రామా టాకీసుకి వెళ్ళే రోడ్డు. పదండి ముందుకు - పదండి తోసుకు --" అన్నాడు.

"మీకు నా మీద ఎందుకంత కక్ష?" ఏడుపు దిగమింగుతూ అతి కష్టం మీద అంది నీలిమ.

అంత దాకా ఆమె స్థితి గమనించని రావు ఒక్కక్షణం గతుక్కుమని, వెంటనే మొహానికి నవ్వు పులుముకుని, "నేను సినిమాకి వెళ్తున్నాను, మిమ్మల్ని స్కూటర్ మీద తీసుకువెళ్తాను. ఎన్టీరామారావు పిక్చరు ప్రతిదీ ఇరవైసార్లు చూస్తాను. ఇప్పటికి 19 సార్లే చూశాను అడవి రాముడు" అన్నాడు.

అది అతని సమయస్ఫూర్తికి ఒక తార్కాణం. ఓసారి అతను కిళ్ళీ బడ్డీ దగ్గర ఆగి ఉండగా బొత్తిగా అథం శుభం తెలియని ఓ అమ్మాయి నీలిమతో కాలేజికి నడుస్తూ "ఎన్టీ రామారావు అంటే ఎవరే? ఆంధ్రప్రదేశ్ ప్రధానమంత్రి కదూ"- అంటోంది. నీలిమ చాలా తీవ్రంగా "ఎన్టీ ఆర్ ఎవరో తెలీదూ. నీ బతుకెందుకే" అని కోపంతో మాటరాక ఆగిపోయింది. అది ఇప్పుడు సమయానికి గుర్తొచ్చి నీలిమ కోపాన్ని క్షణంలో కరిగించ గలిగాడు అతను.

నీలిమ ప్రసన్నమైపోయింది. అతని ఉపన్యాసం గురించి సినిమా అయ్యాకా దెబ్బలాడచ్చు. తను ఇన్నాళ్ళు విన్న కార్లలో తిరిగిందే కాని స్కూటరెక్కలేదు.

స్నేహితురాళ్ళతో "నేను చెప్పానుగా, ఒట్టి మట్టిబుర్రలు, ఈ కాలేజీ కుర్రాళ్ళు. ఒక్కళ్ళకి సమాజం అంటే తెలీదు. ఎంతసేపూ సినిమాలు, చెత్త కథలూ సిగరెట్లు కాల్చడమూనూ. మీరు బస్‌లో వస్తారుగా" అని రావు స్టార్ట్ చేసిన స్కూటరెక్కి అతని నడుం పట్టుకుంది ఒక చేత్తో.

* * *

"స్కూటరు ఎప్పుడు కొన్నారు?" కోకో కోలా పీలుస్తూ అడిగింది నీలిమ.

"కొనలేదు. స్కూటరుంటే బస్ కన్నా ఎక్కువ ప్రగతి వస్తుందని. ప్రగతి పథంలో లంచగొండితనం" నవ్వుతూ అన్నాడు రావు. స్కూటర్ కాదు కదా మూడు చక్రాల సైకిల్ కొనే తాహతు కూడా లేదు అని చెప్పలేదు.

"మీ మొహానికి లంచం ఎవరిస్తారు?" అని క్షణం ఆగి "మీ మొహం బావుంటుందని ఇస్తారేమో లెండి" అంది క్రీగంట చూస్తూ నీలిమ.

"రాంబాబు లేడూ, వాడిది ఇది. డ్రైవింగ్ నేర్పుతున్నాను. ఈ వేళ కావాలంటే ఇచ్చాడు - అబ్బే లంచం కాదు. కూలీ అసలే కాదు. అప్పు. ప్రగతి పథంలో లంచగొండితనం. భలే పేరు పెట్టారు ఈ రోజు టాపిక్‌కి. నాకు బాగా నచ్చింది. మంచి మంచి జోక్స్ పేలుద్దామనుకున్నాను. మీరు నా లెక్చర్ ప్రగతిని నిరోధించారు".

నీలిమకి కోపం వచ్చింది. కోపంతో కోకో కోలా స్పీడుగా పీల్చింది. సీసా ఖాళీ అయి గుర్రు మంది కాగితపు గొట్టం.

ఇప్పుడు దెబ్బలాడితే ఎలా వుంటుంది. అనుకుని తటపటాయించింది. హాల్లో గంటమ్రోగింది. లైట్లు డిమ్ అయ్యాయి. ఇద్దరూ లోపలికి నడిచారు.

* * *

"పూర్వం నాణాలు లేని రోజుల్లో వస్తు మార్పిడి అంటే బార్టర్ పద్ధతిని వ్యాపారం జరిగేది. నా దగ్గర మూడు ఎద్దులుంటే ఓ ఎద్దుని ఎవరికో ఇచ్చి, కలప తెచ్చుకుంటాను ఇల్లు కట్టడానికి. చాలా కష్టంగా వుంటుంది కదూ వ్యాపారం. ఎద్దు కావలసి వుండాలి; కలప వుండాలి. అలాంటి వాడు దొరికేదాకా తిరగాలి నేను, ఎడిటర్లు తిప్పి పంపిన కథలాగా-"

కిలారుమని నవ్వింది నీలిమ.

"అప్పటి ఆర్థిక వ్యవస్థని ఫ్యూడల్ సిస్టం అంటారు. నేను ఈ ఊరు క్యాంప్ వచ్చిన పెద్ద ఆఫీసర్‌కి ఓ విందు చేస్తే మూడు సీసాలు ఆరు గ్లాసులుగా స్కాచ్ విస్కీతో పార్టీ ఇస్తే దాన్ని అతిథి మర్యాద అంటారు. లంచం అనరు. నేనక్కడ వెయ్యి రూపాయలు ఖర్చు చేసినా సరే. ఎటొచ్చీ నాకు అవసరమైన పని ఏదో జరిగేలా అతను సాయం చేస్తాడు. నా వ్యాపారం ప్రగతి పథంలో పడుతుంది."

ఎన్టీ ఆర్ నటనా సముద్రంలో మునకలు వేస్తున్న నీలిమ పరధ్యానంగా "మా నాన్నగారూ అంతే నెలకి పది పన్నెండు పార్టీలు ఇస్తుంటారు. మా ఇంట్లో ఫారిన్‌లో కొన్న నడుం లేని గ్లాసులు వంద వున్నాయి. అవెప్పుడూ గాజు తలుపుల కేబినెట్లో పెట్టి తాళం వేస్తారు"-


"అందుకే మీ నాన్న అంత త్వరగా లక్షలు సంపాదించాడు. గట్టివాడే".

"కొందరు ఇంజను డీలర్లు ఆఫీసర్లుకి లంచాలు ఇస్తారు. మా నాన్నకి వాళ్ళంటే పట్టరాని కోపం. చాలా కరక్టుగా ఉండాలి బిజినెస్‌లో అంటారు. అయినా అందరి కంటే ఎక్కువగా మాకే లాభాలు వస్తాయి. వచ్చిన లాభంలో సగం ఈ పార్టీలకి, రాజకీయ పార్టీల విరాళాలకి సరిపోతుంది. ఎంత మంచివాడో మానాన్న".

"ఏ పార్టీకి..."

"అందరికీని. కాంగ్రెస్, జనతా, సోషలిస్టు... కాని మనదేశంలో ముప్ఫై ఆరు కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయిగా. వాళ్ళంటేనే ఆయనకి ఇష్టం. అందరికీ సమానంగా ఇవ్వరనుకో."

సినిమా పతాక సన్నివేశం నడుస్తోంది. అడవి ద్రోహుల్ని మారు వేషాల్తో



ఆకట్టుకుంటున్నారు హీరోలు.

"మారు వేషంలో ఎంత మహత్తుంది! ఎంత మత్తుంది! లంచాన్ని డబ్బుగా కాక, ఫ్యూడల్ పద్ధతిలో వస్తు రూపేణా ఇస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఇచ్చేవాళ్ళూ, పుచ్చుకునే వాళ్ళూ తరిస్తారు. చూసే వాళ్ళు ఆనందిస్తారు!"

నీలిమ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని సినిమా చూస్తోంది. రావు మాటలకి చోటే లేదు ఆమె మనస్సులో. రావు సినిమా ఎలానూ చూట్టం లేదు. వెండి తెర నించి వచ్చిన లేత వెలుగులో నక్షత్రాల్లా మెరుస్తున్న అమ్మాయి పెద్ద పెద్ద కళ్ళని చూస్తున్నాడు.

నీలిమ క్లైమాక్స్ సీన్‌లో పట్టరాని ఉద్రేకంతో రావు చేతిని గట్టిగా కొట్టింది. రావు ఉలిక్కిపడి "నన్నెందుకు కొట్టడం! ఆ సినిమా నేను తీయలేదు. కనీసం కథ కూడా రాయలేదు" అన్నాడు చుర్రుమన్న చెయ్యిని అరచేత్తో నిమురుకుంటూ.

"పొండి మీ బండ జోకులూ మీరూను".

* * *

రైలు స్టేషన్ దర్శకుడు లేని సినిమాలా కోలాహలంగా ఉంది.

"బెర్త్ దొరికిందా"

"బెర్త్‌లు రైలు పెట్టెలో ఉంటాయి. బుకింగ్ ఆఫీసులో ఎందుకుంటాయి?"

"హాస్యాలకేం గాని రాజమండ్రి వచ్చేసరికి నాకు నిద్దరొచ్చేస్తుంది. బెర్త్ లేకపోతే ఎక్కడ నిద్దరోను మీ ఒళ్ళోనా".

"అభ్యంతరం ఒక్కటే. మీ మొనాపొలిస్టు కళ్ళని చూడ్డానికి వీలుండదు మీరు నా ఒళ్ళో కూర్చుంటే".

"నా వేం మొనాపొలిస్టు కళ్ళు కావు. అభ్యుదయ కళ్ళు".

"మొనాపొలిస్టు అంటే అంత సంపదనీ ఓ చోట పోగేసుకోడం. లక్షమంది అందమైన అమ్మాయిల కళ్ళలో ఉన్నంత అందం మీ కళ్ళలో వుంటే ఏ మనాలి? సోషలిజంలో అందాన్ని కూడా సమంగా పంచుతారేమో అందరికీ."

"మీకన్నీ ఒంకర బుద్ధులే. మీతో వాదించలేను. మీరు బెజవాడలో దిగిపోతే హైద్రాబాద్ దాకా ఒక్కర్తినీ ఎలా వెళ్ళడమో పాలుపోటం లేదు."

"తర్వాత చూద్దాం కూర్చోండి" అని నాలుగు సీట్ల అవతల జరుగుతున్న 'ఆమ్యామ్యా' వ్యవహారాన్ని చూసీ చూడనట్లు పరిశీలిస్తున్న రావు. "బెర్త్‌కి అయిదు రూపాయలు ఆరుటిక్కెట్లకీ ఆరయిదులు ముప్ఫై".



"నిన్ను చూడగానే నాకు వాసుదేవ రావు జ్ఞాపకం వస్తాడు".

"అయ్యో; నాకు ఆతనికి పోలికలే లేవే!"

"లేదు; కాని అతను కూడా నాకు ఇరవై రూపాయలు బాకీ ఉన్నాడు".

---

"సార్ లోవర్ మిడిల్ క్లాసు వాళ్ళం కాస్త.."

"ఇరవై ఇవ్వండి"

"పది చేసుకోండి".

"అయితే ముప్ఫై ఇచ్చి టిక్కెట్లు తీసుకోండి" బుక్ తీశాడు జేబులోంచి, చేతిలో ఉన్న విజయచిత్ర, సినీ హెరాల్డ్, స్టార్ డస్ట్‌పత్రికల్ని చంకన బెట్టి. ఆ పత్రికలన్నీ చూసి తీవ్రాలోచనలో పడ్డాడు రావు.

"ఆమ్యామ్యా"సీను ఓ కాల్‌షీట్ పూర్తయ్యింది. తరువాత తనదే.

నీలిమ బ్లిట్జ్ చదువుతోంది. రావు ఆమె పక్కని నిలబడి "ఎక్కువ చదివితే కళ్ళ బలం తగ్గి, గ్లాసెస్ అవసరం వస్తుంది. అప్పుడిక నీకు వాణిశ్రీ తల్లి వేషాలే ఇస్తారు" అన్నాడు.

తెల్లబోయి చూసింది నీలిమ. పక్కసీట్లో మగతగా కూర్చున్న ముగ్గురూ వాళ్ళ మీదకి ఫోకస్ చేశారు.

"ఇంత మంది అమ్మాయిలు నీతోపాటికి వచ్చారు కదా, కాశీనాథ్, (ఏక్ డైరక్టర్) నీకెందుకు హీరోయిన్ యిచ్చాడనుకున్నావు. నీ కళ్ళు చూసి " అర్థం కాక ఇంకా కళ్ళు పెద్దవి చేసింది నీలిమ.

"టికెట్ ప్లీజ్"

"కూర్చోండి సార్. మీకు సినిమా నాలెడ్జ్ చాలా వుంది. మీరు చెప్పండి - సినిమా హీరోయిన్‌కి కళ్ళు ఆరోగ్యంగా ఉండడం ఎంత ముఖ్యమో" దగ్గర బంధువుతో మాట్లాడినట్టు పలకరించాడు రావు.

"ఈ అమ్మాయి నా కజిన్ లెండి. ఇంటర్ చదువుతోంది. ఆర్ట్స్ గ్రూప్ తీసుకుంది. అయినా కష్టపడి ఎంబిబియస్ చదివి ప్రజాసేవ చేసి తరించాలని. డైరక్టర్ కాశీనాథ్ నాకు చాలా పెద్ద ఫ్రెండు. నాతో ఈమెని చూసి హీరోయిన్‌గా బుక్ చేశాడు. రేపట్నించీ హైద్రాబాద్‌లో షూటింగ్. చదవద్దు అంటే వినదు" అని, కొంచెం వినయంగా తలవంచుకుని

"నాకూ ఓ పదకొండు కాల్ షీట్లున్న వేషం ఇచ్చాడనుకోండి. మీరు చెప్పండి సార్. డైరక్టర్లలో టాప్ ఎవరు? సత్యజిత్ రాయ్‌ని వదిలేయండి. బాపు తర్వాతే అందరూ అంటాను. ఆఫ్‌కోర్స్ విశ్వనాథ్, దాసరి నారాయణరావు......"

సినీ హీరోయిన్‌గా నటించలేకపోతున్న నీలిమని అరడజను జతల కళ్ళు ఆప్యాయంగా స్పర్శించాయి.

"హ హ హ అంతా తమాషాగా ఉంటుంది తల్చుకుంటే. నేనూ గీతా జ్యోతీ (నీలిమని చూపిస్తూ) మొన్న సెలవుల్లో సంగతి. టీ నగర్లో ఓ కాకా హోటల్లో టీ తాగుతున్నాం. డైరక్టర్ కాశీనాథ్, ప్రొడ్యూసర్ ఎంవీయల్‌తో కలిసి అక్కడికే వచ్చాడు. తమాషా చూడండి... వాళ్ళూ టీ తాగడానికే వచ్చారు..."

"అప్పుడేమయింది"

"మిగతాది వెండి తెరపై చూడండి" అందరూ గట్టిగా నవ్వారు. రావు కూడా నవ్వుతూ "మీరు చెప్పండి సార్ ఫొటో జెనిక్ అనాలా, ఫొటో జీనిక్ అనాలా..." అలా అయిదు నిముషాలు గడిచాకా, "గీతా నీకు నిద్దరొస్తోందా. పోయి బెర్తు మీద పడుకో... మాకు బెర్త్ దొరకలేదు సార్ ఎంత ట్రై చేసినా. ఫస్ట్‌క్లాస్‌లో వెళదామంటే ఈవిడ ససేమిరా వినలేదు. వీళ్ళ నాన్న మాజీ బస్ కండక్టర్ లెండి. కర్తవ్య నిర్వహణలో బస్ చక్రం కిందపడి కాలు పోయింది. డాడీసొమ్ముతో నేను ఫస్ట్‌క్లాసులో వెళ్తా కులకనా శ్యామ్ అంది."

"అమ్మాయి! వెళ్ళి ఆ బెర్త్ మీద పడుకో. శ్యామ్ బాబు చెప్పినట్లు సినిమా స్టార్స్ కళ్ళకి చాలా రెస్టుండాలి."

ఈ జంటని రిసీవ్ చేసుకోడానికి కారు వచ్చింది. పెట్లో అందరికీ ఆటో గ్రాఫ్‌లు యిచ్చింది నీలిమ.

కారులో

"అన్ని అబద్దాలు ఎలా చెప్పగలిగారు. సిగ్గేనా వెయ్యలేదూ!"

"ఆమ్యామ్యాలో ఒక పద్ధతి అందమైన అబద్ధాలు చెప్పడం. మీ నాన్నఅందరికీ పార్టీలు ఇచ్చినట్లే".

"మీరు దొంగ మాటలు చెప్పకండి"

"వస్తు రూపేణా ఇస్తే ఫ్యూడల్ ఆమ్యామ్యా. నగదు రూపంలో అయితే కేపిటలిస్టు ఆమ్యామ్యా. కేవలం మాటలతోనే ఇచ్చేదాన్ని సోషలిస్టు ఆమ్యామ్యా అంటారు. నేను దాంటో స్పెషలిస్టుని. లేకపోతే ఏ లంచమూ ఇయ్యకుండా మీ నాన్న నాలాంటి బికారికి పిల్లనిస్తాడా?" ●